andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 కనిష్ఠం 17.1

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ జిల్లా వార్తలు

5 మంగళవారం 2 జనవరి 2024



• మంచిప్ప పంప్‌హౌజ్



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

జిల్లా మరింత పురోగతి సాధించాలి

• నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జనవరి 1: నూతన సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆకాంక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ కేక్‌ను కట్ చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అధికారులు, అనధికార ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కలెక్టర్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో విరసిల్లాలని అనుకున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జడ్పీసీవో గోవింద్, డీఆర్‌డీవో చందర్, ఆర్‌డీవోలు రాజేంద్ర కుమార్, వినోద్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు. స్నేహసొసైటీ చిన్నారులతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేశారు.

దుప్పట్లు, నోట్‌బుక్‌లతో కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు..

కలెక్టర్ పిలుపునకు అధికార యంత్రాంగం కదిలింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపేందుకు పూలబొకేలకు బదులుగా పేద విద్యార్థుల కోసం బ్లాంకెట్లు, నోట్‌బుక్‌లు తేవాలని కలెక్టర్ పిలుపు మేరకు విశేషస్పందన లభించింది. అధికారులు, అనధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు దుప్పట్లు, నోట్‌బుక్‌లను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో వాటిని సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా తన విజ్ఞప్తి మేరకు బ్లాంకెట్లు, నోట్‌బుక్‌లు అందజేసిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల వసతి గృహాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రస్తుతం చలిబారి నుంచి విద్యార్థులు కాపాడుకునేందుకు బ్లాంకెట్లు ఉపయోగకరంగా ఉంటాయని కలెక్టర్ అన్నారు.



కలెక్టర్‌కు బ్లాంకెట్లను అందజేస్తున్న ఆఫీసర్స్‌క్లబ్ ప్రతినిధులు



సా.. గుతున్న ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులు

- దశాబ్దంన్నరగా కొనసాగుతున్న పనులు
- కాళేశ్వరం పథకంలో కలిపినా పూర్తికాని పైప్‌లైన్ల నిర్మాణం
- రెండేళ్లుగా ప్రకటనలు చేస్తున్నా.. ఆయకట్టుకు అందని నీరు
- ఇప్పటికీ మొదలు పెట్టని 22వ ప్యాకేజీ పనులు

నిజామాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి రాష్ట్ర హయాంలో చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులు దశాబ్దంన్నర గడిచినా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఆయకట్టుకు సాగునీటి విడుదల లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ ప్యాకేజీలను కాళేశ్వరం పథకంలో కలిపి రీడిజైన్ చేసినా ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. మూడు ప్యాకేజీల్లో రెండింటి పనులు ఇంకా కొనసాగుతుండగా మరొక ప్యాకేజీ పనులు మొదలు కాలేదు. ఈ ప్యాకేజీలకు అవసరమైన రిజర్వాయర్ పనులను ఇప్పటికీ మొదలు పెట్టలేదు. రీడిజైన్ చేసి ఎత్తు పెంచినా రిజర్వాయర్‌ను పాత డిజైన్ ప్రకారమే నిర్మించాలని ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహించినా ఇప్పటికీ ఎలాంటి ప్రకటన లేదు. రాష్ట్రంలోనే మొదటి సారిగా కాలువలకు బదులు పైప్‌లైన్ల ద్వారా సాగునీటిని పంటలకు అందించేందుకు డిజైన్ చేసినా ఇంకా పనులు పూర్తి కాలేదు. ప్రతియేడు గడువు పెంచుకుంటూ పోతున్నా పంప్‌ల పనులు కొన్ని పూర్తయినా ఇప్పటికీ సాగునీటిని రైతాంగానికి మాత్రం అందించడం లేదు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఈ ప్యాకేజీ పనులు పూర్తికాకపోవడం వల్ల ఇప్పటికీ జిల్లా రైతులు ఎదురు చూస్తున్నారు.

4లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు..

ఎస్సారెస్పీ నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉమ్మడి రాష్ట్ర హయాంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఉమ్మడి జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్యాకేజీ 20, 21, 22లకు అనుమతి ఇచ్చారు. ఈ ప్యాకేజీలో భాగంగా 20, 21 కింద నిజామాబాద్ జిల్లాలో 2లక్షల 20వేల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. ప్యాకేజీలో భాగంగా 22 కింద కామారెడ్డి జిల్లాలో 2లక్షలలోపు ఎకరాలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేశారు. ఎస్సారెస్పీ నుంచి బ్యాక్ వాటర్‌ను బినోల మీదుగా సారంగపూర్ వరకు తరలించి అక్కడి నుంచి ప్యాకేజీ 21 ద్వారా జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా అప్పటి ప్రభుత్వం డిజైన్ చేసింది. బినోల నుంచి సారంగపూర్ వరకు ఉమ్మడి రాష్ట్ర హయాంలోనే సొరంగ మార్గం పనులను పూర్తి చేశారు. సారంగపూర్ నుంచి మంచిప్ప వరకు కూడా రెండో సొరంగ మార్గం పనులను దాదాపు దగ్గరకు తీసుకువచ్చారు. కామారెడ్డి జిల్లా పరిధిలో 22 ప్యాకేజీ కింద కొన్ని పనులను చేశారు.

కాళేశ్వరం పథకం కిందే ప్యాకేజీ పనులు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో ఈ పథకాన్ని కాళేశ్వరం పథకంలో కలిపారు. ఈ ప్యాకేజీల పనులను కాళేశ్వరం పథకం కిందనే చేపట్టేందుకు నిర్ణయించారు. ప్యాకేజీలను రీడిజైన్ చేయడంతో పాటు మంచిప్ప రిజర్వాయర్ ఎత్తును కూడా పెంచేందుకు నిర్ణయించారు. ప్యాకేజీలో భాగంగా బినోల నుంచి సొరంగ మార్గం ద్వారా నీటిని సారంగాపూర్ సర్జుపూల్ వరకు తరలించడంతో పాటు అక్కడ మోటార్లను బిగించి పనులను పూర్తి చేశారు. ఈ ప్యాకేజీలో భాగంగా 21ను రీడిజైన్ చేశారు. ఈ ప్యాకేజీని 21, 21ఏ గా నిర్ణయించి రీడిజైన్ చేశారు. ఈ ప్యాకేజీ కింద సారంగపూర్ నుంచి నిజాంసాగర్ కెనాల్ ద్వారా మెంట్రాజ్‌పల్లి వరకు నీటిని తరలించి అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, మెట్‌పల్లి వరకు తరలించేందుకు నిర్ణయించారు. పైప్‌లైన్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇవే కాకుండా సారంగపూర్ నుంచి నీటిని సొరంగ మార్గం ద్వారా మంచిప్పకు తరలించి అక్కడి నుంచి గడ్కోల్ పంప్ ద్వారా సిరికొండ వరకు నీటిని పైప్‌లైన్‌ల ద్వారా తరలించేందుకు ఏర్పాట్లను చేశారు. ఐదేళ్లుగా ఈ పైప్‌లైన్ల నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ పనులకు సుమారు 2800 కోట్ల రూపాయలు వెచ్చించేందుకు నిర్ణయించారు. పైప్‌లైన్ల నిర్మాణాన్ని ఇప్పటి వరకు 70 శాతం వరకు పూర్తి చేశారు. ఇంకా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. మంచిప్ప వద్ద గడ్కోల్ పంప్‌ల నిర్మాణం కోసం పనులను చేశారు. ప్యాకేజీ 21 కింద గత సంవత్సరమే ప్రయోగాత్మకంగా సాగునీటిని 40వేల ఎకరాల వరకు అందిస్తామని నిర్ణయించినా ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ఈ ప్రాజెక్టుకు కీలకమైన రిజర్వాయర్ మంచిప్పను చేపట్టలేదు. ప్రాణహిత చేవెళ్ల పథకం కింద అప్పుడు ఉన్న రిజర్వాయర్ డిజైన్ ప్రకారమే చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నా పైప్‌లైన్‌లకు అవసరమైన నీటి నిల్వలు ఉంచేందుకు రీడిజైన్ కింద 3.5 టీఎంసీకి పెంచారు. ఈ ఎత్తు పెంచడం వల్ల మంచిప్పతో పాటు 9 తండాల వరకు ముంపునకు గురవుతుండటంతో వారు ఆందోళన నిర్వహించారు. చాలా రోజుల పాటు ప్రాజెక్టు వద్ద, జిల్లా కేంద్రంలో ఆందోళనలు నిర్వహించడంతో రీడిజైన్‌ను ఆపలేదు. ఇప్పటి వరకు భూసేకరణ చేయలేదు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో చేసిన పనులే ఇప్పటి వరకు ఉన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ప్రాణహిత చేవెళ్ల కింద చేపట్టిన ఈ ప్యాకేజీ పనులు ప్రత్యేక రాష్ట్ర హయాంలో కూడా కాళేశ్వరం కింద పూర్తికాలేదు. ప్రస్తుతం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రావడంతో జిల్లా రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. మళ్లీ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపడతామని కాంగ్రెస్ మంత్రులు ప్రకటిస్తుండటంతో జిల్లాలోని ఈ ప్యాకేజీల పనులు త్వరగా పూర్తి చేస్తే తమకు సాగునీరు అందుతుందని రైతులు భావిస్తున్నారు. కాలువల ద్వారా కాకుండా మొదటిసారిగా పైప్‌లైన్‌ల ద్వారా పంట చేనులకు సాగునీరు అందించేందుకు డిజైన్ చేసిన ఈ ప్యాకేజీ పనులు త్వరగా పూర్తి చేస్తే ఉమ్మడి జిల్లా పరిధిలో 4లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుంది.

మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



• వివరాలు వెల్లడిస్తున్న అదనపు డీసీపీ జయరాం

ఖిల్లా/ డిచ్‌పల్లి జనవరి 1: డిచ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో 44వ నెంబర్ జాతీయరహదారిపై నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు నిషేధిత మాదకద్రవ్యాలు తరలిస్తున్న ఇద్దరు నిందితులను టాస్క్‌ఫోర్స్, డిచ్‌పల్లి పోలీసులు పట్టుకున్నట్లు సోమవాం అదనపు డిప్యూటీ పోలీసు కమిషనర్ జయరాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కచ్చితమైన సమాచారం మేరకు కారులో అక్రమంగా మాదకద్రవ్యాలు రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా వెళ్తున్న ఏపీ05డీఎన్‌ నెంబర్ గల నీలిరంగు స్కోడా కారు ఆపి పరిశీలించగా కారు ముందుభాగంలోగల డాష్‌బోర్డులో మూడు పాలిథిన్ తెల్లటి కవర్‌లో, మరొక ట్రాన్స్‌ఫరెంట్ కవర్‌లో కోన్ ఆకారంలోగల ముక్క, డిక్కీలో మరో చిన్న ప్యాకెట్లను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని క్లూస్ టీమ్ సిబ్బంది పరిశీలించి చూడగా అందులో ఎండీఎంఏ అనే మాదకద్రవ్యంతో పాటు తెల్లని ముద్దను క్రొకైన్‌గా గుర్తించారన్నారు. కారు వెనకభాగంలో దొరికిన ప్యాకెట్‌లో పొడి గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. వాటిని మేడియేటర్ సహకారంతో బరువు తూచగా ఎండీఎంఏ డ్రగ్ 3.2 గ్రాములు, కొకైన్ 12.3 గ్రాములు, గంజాయి పౌడర్ 3.1 గ్రాములుగా ఉన్నట్లు తెలిపారు. వీటిని ఢిల్లీకి చెందిన రాహుల్ అనే వ్యక్తి ద్వారా ఢిల్లీకి చెందిన షైక్ అనే వ్యక్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లా అలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన వ్యక్తి ప్రస్తుతం బొటానికల్ గార్డెన్ రోడ్, గచ్చిబౌలిలో నివాసం ఉంటున్న ద్వారంపూడి విక్రమ్, మల్నాడు జిల్లా చిలకలూరి పేట మండలానికి చెందిన ప్రస్తుతం పంచవటి కాలనీ, మనికొండ హైదరాబాద్‌కు చెందిన షేక్ ఖాజామోయినొద్దీన్ తీసుకొని నూతన సంవత్సరం వేడుకల్లో స్నేహితులతో కలిసి వినియోగించడానికి కారులో తరలిస్తున్నట్లు తెలిపారు. వాటిని స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



• నగరంలోని కంఠేశ్వర్ ఆలయంలో..

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా కిటకిటలాడిన ఆలయాలు
- ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు
- కొత్త ఏడాదిలో మంచి జరగాలని మొక్కులు

2024

నూతన సంవత్సరం సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పలు ఆలయాలు కిటకిటలాడాయి. కొత్త సంవత్సరం కావడంతో ప్రజలంతా ఆలయాల బాట పట్టారు. నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ప్రజలు దైవదర్శనం చేసుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, మాధవనగర్ సాయిబాబా ఆలయం, గంగాస్థాన్-2లోని ఉత్తర తిరుపతి ఆలయం, జెండాబాలాజీ, సుభాష్‌నగర్ రామాలయం, శంభుని గుడి, మోపాల్ నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయం, అడవిమామిడిపల్లి అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయం, తదితర ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్







• కంఠేశ్వర్ ఆలయంలో..



• మాధవనగర్ సాయిబాబా ఆలయంలో..



• ఇందూరు తిరుమల ఆలయం



న్యూ ఇయర్ కిక్

- ఆబ్కారీ శాఖకు రెండు రోజులకు రూ.9కోట్ల 20లక్షల ఆదాయం
- డిసెంబరులో 2వందల కోట్ల మద్యం అమ్మకాలు

సుభాష్‌నగర్, జనవరి 1: జిల్లాలో కొత్త సంవత్సర వేడుకలకు లిక్కర్ కిక్ ఇచ్చింది. వేడుకల సందర్భంగా మందుబాబులు మత్తులో ఊగిపోయి ఎక్సైజ్ ఖజానాను ఫుల్‌కిక్కుతో నింపారు. దీంతో ఆ బ్కారీశాఖ ఖజానాకు భారీగా ఆదాయం తెచ్చిపెట్టింది. నూతన సంవత్సరం అనగానే యువత మద్యం కొనుగోలు ఎక్కువగా చేయడంతో భారీగా ఆదాయం చేకూరింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 102 వైన్సులు, 12 బార్లలో మద్యం విక్రయాలు జరిగాయి. దీంతో శని, ఆదివారాలను కలుపుకుని సుమారు రూ.9కోట్ల 20లక్షల ఆదాయం సమకూరింది. మామూలు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కేవలం రూ.3కోట్ల ఆదాయం రాగ, రెండు రోజుల్లో 9కోట్ల 20లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. దీంతో రూ.3 కోట్లకు పైగా రెట్టింపు ఆదాయాన్ని ఆ బ్కారీ శాఖ సమకూర్చుకుంది. డిసెంబరులో భారీగా అమ్మకాలు జరిగాయి. జిల్లాలో లిక్కర్ కన్న ఎక్కువగా బీరు కొనుగోళ్లకే మందుబాబులు మక్కువ చూపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.200కోట్ల మద్యం అమ్మకాలు డిసెంబరులో జరిగాయి. నిజామాబాద్ జిల్లాలో సుమారు రూ.144కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో లిక్కర్ అమ్మకాలు లక్షా40వేలు జరగగా బీర్ అమ్మకాలు లక్షా 83వేల అమ్మకాలు జరిగాయి. గత సంవత్సరం కేవలం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 170కోట్ల అమ్మకాలు డిసెంబరులో జరగగా నిజామాబాద్ జిల్లాలో రూ.118కోట్ల అమ్మకాలు జరిగాయి. గతంతో పోల్చితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 కోట్లు అదనపు ఆదాయం నిజామాబాద్‌కు 22కోట్ల ఆదాయం అదనంగా సమకూరింది. నూత న మద్యం పాలసీకి సంబంధించిన దుకాణాలు డిసెంబరు 1నుంచే మొదలవడంతో కొన్ని చోట్ల మద్యం అమ్మకాలు మం దకొడిగా సాగాయి. స్టాక్ కూడా 2,3 తేదీల నుంచే మద్యం దుకాణాల్లో అందుబాటులో ఉండడంతో మద్యం అమ్మకాలు నెమ్మదిగా సాగాయి. అయినా గత సంవత్సరం కంటే ఆదాయం ఆబ్కారీ శాఖకు నూతన సంవత్సర వేడుకలు తెచ్చి పెట్టాయి.

నేడు కమ్మర్‌పల్లిలో ప్రజాపాలన గ్రామసభ

కమ్మర్‌పల్లి, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న గ్యారంటీ పథకాల ప్రజాపాలన గ్రామసభ మంగళవారం ఉదయం 9 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీఈవో సంతోష్ రెడ్డి, తహసీల్దార్ అంజనేయులు, కార్యదర్శి శాంతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదమం 9 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు లబ్ధిదారులనుంచి వివిధ పథకాలపై దరకాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. కాగా ఈనెల ఆరువరకు దరకాస్తులు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇవ్వవచ్చని తెలిపారు.

నిజామాబాద్ జిల్లాలో 79 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

ఖిల్లా, జనవరి1: పోలీసు కమిషనర్ పరిధిలో కొత్త సంవత్సరం సందర్భంగా మద్యం తాగి వాహనాలను నడిపిన 79మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు (లా అండ్ ఆర్డర్) జయరాం తెలిపారు. కొత్త సంత్సరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 750మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారన్నారు. ఇందులో ఏసీపీ నేతృత్వంలో ముగ్గురు ఏసీపీలు, 10మంది సీఐలు, ఎస్ఐలు 32మంది, నాలుగు స్పెషల్ పార్టీ సిబ్బందితో పాటు ప్రత్యేక పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆదివారం సాయంత్రం 6గంటల నుంచి రాత్రి ఒంటి గంట వరకు ప్రధాన రోడ్లపై విధులు నిర్వహించడం వల్ల ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగలేదని, తాగి వాహనాలు నడిపే వారు కూడా తగు జాగ్రత్తలు తీసుకున్నారని, ఇలా చేయడం వల్ల ఎటు ప్రమాదాలు జరగలేదన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నూతన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యానంద్, రమేష్, గంగాధర్, సాయన్న, రాజారాం, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

డొంకేశ్వర్, జనవరి1: మండలంలో ఆధార్ సెంటర్ లేకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నా రని, తక్షణమే సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న పథకాలను వినియోగించుకోవడా నికి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆధార్ కార్డులో పేర్లు, అడ్రస్ తప్పులు ఉండడం వల్ల దరఖాస్తులు చేసేందుకు నానా ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. డొంకేశ్వర్‌లో ఆధార్‌సెంటర్‌లో 40మందికి మాత్రమే అవకాశం ఉండడంతో నందిపేట మండలానికి వెళ్లాల్సి వస్తుందని, ప్రజలు ఇబ్బందులను గుర్తించి ఆధార్‌కార్డులో తప్పులు సరిచేసేందుకు వెంటనే ఆధార్‌సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కోరేగావ్ యుద్ధ వీరులకు నివాళి

ఆర్మూర్‌టౌన్ , జనవరి1: బీమ్ కోరేగావ్ విజయోత్సవ దివస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బీమ్ కోరేగావ్ యుద్ధ వీరులకు ని వాళులు అర్పించారు. 28వేల మంది మనువాద బీస్వబాజీరావు రెండు సైన్యా లతో బీమ నది ఒడ్డున 500మంది మహా సైనికులు వీరోచితంగా పోరాడి 1818 జనవరి 1న సైనికులను తరిమికొట్టి విజయం సాధించారని తెలిపారు. ప్రతీ సంవత్సరం జనవరి 1న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బతికున్నంత వరకు బీ మ్ కోరేగావ్‌కు వెళ్లి మహార్ అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహార్ సైనికుల ఆత్మగౌరవ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని వారు అన్నారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, గుమ్మడి చంద్రయ్య, అంగరి ప్రదీప్, మూగ ప్రభాకర్, పింజ అశోక్, పింజ భూమేశ్వర్, జంగం అశోక్, జీజీ.రాం, వికాస్, ఇత్వార్‌పేట్ లింగన్న, చిక్కు, గణేష్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి పెద్ది వెంకట్‌రాములు

ఆర్మూర్‌రూరల్, జనవరి1: దరఖాస్తులు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి ఎలాంటి షరతులు లేకుండా ఆరు గ్యారంటీ పథకాలను అందించాలని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి పెద్ది వెంకట్‌రాములు, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్మూర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆర్మూర్ ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యారంటీ పథకాలు అమలులో నిబంధనలు విధిస్తే పేదలకు పథకాలు అందకుండా పోతాయన్నారు. నిజాయితీగా సర్వే నిర్వహించి పేదలందరికీ లబ్ధిచేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కొండ గంగాధర్, కూతడి ఎల్లయ్య, సాయిలు, రవి, భూమన్న, అశోక్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల శోభాయాత్ర



బోధన్‌లో అయోధ్య అక్షింతలతో శోభా యాత్ర దృశ్యం



నవీపేటలో అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం



డొంకేశ్వర్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న దుర్గామాత సేవ సమితి

బోధన్ రూరల్, జనవరి 1 : అయోధ్యలో రామ మందిరం నిర్మించి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చరిత్ర సృష్టించారని బోధన్ బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లోని శ్రీరామ మందిరంలో శ్రీరాముల అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వార్డులలో శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్య రామ మందిరంలో పూజలు చేసి అక్షింతలు తెచ్చిన అయోధ్య రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని హనుమాన్ టెకిడి తదితర ప్రాంతాలలో ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. బీజేపీ మాజీ కౌన్సిలర్ ధర్మ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. అయోధ్యలోని రాముల వారి మందిరంలో పూజలు నిర్వహించిన అక్షింతలు గ్రామ గ్రామాన, పట్టణాల్లోని పలు ప్రాంతాలలో ఇంటింటికీ చేరడం భారతీయుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, బీజేపీ నాయకులు, హిందూ ధర్మ యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో

నవీపేట : మండల కేంద్రంలో సోమవారం అయోధ్య రామాలయంలో పూజిత అక్షింతలను ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక హనుమాన్ మందిరంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని వార్డుల వారిగా ఇంటింటికీ వితరణ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీరామ మందిర విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని అదే రోజున ప్రతీ ఇంటిలో ఐదు దీపాల చొప్పున వెలిగించాలని హిందూ సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో తమ్మలి కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, నాంపల్లి వసంత్ కుమార్, శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, అరవింద్, సందీప్, ఎంపీటీసీ రాధ, తదితరులు పాల్గొన్నారు.

నీలాలో

రెంజల్: మండలంలోని నీలా గ్రామంలో సోమవారం అయోధ్య నుండి చేరుకున్న పూజిత అక్షింతలను గ్రామస్థులు ఉదయం శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్య రామ జన్మభూమిలో అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన పూజిత అక్షింతల శోభాయాత్ర సోమవారం నీలా గ్రామానికి చేరుకుంది. గ్రామంలోని రామాలయంలో అయోధ్య రాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు మంగళహారతులతో గ్రామంలోని వీధుల గుండా పూజిత అక్షింతలను రాముల వారి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటికీ అయోధ్య పూజిత అక్షింతలను అందజేశారు. ఈ యాత్రలో వైస్ ఎంపీపీ క్యాతం యోగేష్, శివ, రమేష్, గంగాధర్, అనిల్, నాగభూషణం పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో

డొంకేశ్వర్: మండలంలోని సిర్పూర్ గ్రామంలో అంజనేయస్వామి ఆలయంలో సోమవారం దుర్గామాత సేవ సమితి సభ్యులు అయోధ్య రాముని అక్షింతలను పూజించారు. అనంతరం గ్రామంలో మహిళల మంగళహారతులతో స్వాగతం పలికి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి క్యాలెండర్, రాముల వారి అక్షింతలు, రామాలయం ఫొటోలతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లతగణేష్, ఉత్సవ కమిటీ సభ్యులు చిలుక రవి, కిషన్, మోహన్, దయానంద్, మహేష్, నరేష్, శశికుమార్, రాజు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ముబారక్‌నగర్‌లో..

ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ముబారక్‌నగర్ సాయిటవర్స్‌లో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రలో పండుగ వాతావరణం నెలకొంది. ఆర్టీసీ కాలనీలోని శక్తిమాన్ హనుమాన్ ఆలయంలో అయోధ్య శ్రీరామచంద్రభూమి తీర్థట్రస్ట్ నుంచి వచ్చిన పూజిత అక్షింతలను ఆలయ నిర్వాహకులు సాయిటవర్స్ ప్రతినిధులకు అందజేశారు. ఈ పూజిత అక్షింతలను ఊరేగింపుగా తీసుకువచ్చి సాయిటవర్స్‌లోని ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆర్టీసీ కాలనీ నుంచి ముబారక్‌నగర్ వరకు పూజిత అక్షింతల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సాయిటవర్స్ కమిటీ ప్రతినిధులు సురేందర్‌గౌడ్, లక్ష్మణ్‌రావు, రాజు, నవీన్, బాలకుమార్, సింహాచలం, కిశోర్, సంజీవ్‌రెడ్డి, రామారావు, మహేష్, బాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దూస్‌గాం,మిట్టపల్లిలో

డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం, మిట్టపల్లి గ్రామాల్లో సోమవారం అయోధ్య నుంచి రాముల వారి అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి అక్షింతలు స్వీకరించారు. పూజిత అంక్షితలను ఇంట్లో ఉన్న కొద్దిపాటి బియ్యంలో కలుపుకొని వాటిని రాముల వారి పాదల వద్ద ఉంచాలని తెలుపడంతో మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు,సర్పంచ్, ఎంపీటీసీ, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంచిర్యాల్‌లో

ముప్కాల్: మండలంలోని వెంచిర్యాల్; నల్లూర్ గ్రామాలలో అయోధ్య రాముని పూజిత అక్షింతలు చేరాయి. ఈ సందర్భంగా అయోధ్య రాముని అక్షింతలు పూజించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అక్షింతలు, కలశాలను శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామ వీధులగుండా డప్పువాయిదాలు, మహిళలు శోభాయాత్రలో పాల్గొడంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ మట్ట సందీప్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, నిమ్మల నర్సయ్య, నరేష్, మహేష్ ఉపసర్పంచ్ నవీన్, రఘునాథ్, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, బీజేపీ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ముబారక్‌నగర్‌లో అక్షింతల ఊరేగింపు దృశ్యం



దూస్‌గాంలో



వెంచిర్యాల్‌లో మంగళహారతులతో మహిళలు

ఘనంగా బోనాల ఊరేగింపు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి, జనవరి 1: మండలంలోని బషీరాబాద్ దూలగుట్టపై కొలువుదీరిన యాదవుల ఆరాధ్యదైవం మల్లన్న స్వామి కల్యాణం, జాతర ఉత్సవాల్లో భాగం సోమవారం గ్రామంలో బోనాల ఊరేగింపు, మల్లన్న స్వామి, గొల్లకేతమ్మ, మేడలమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం మహిళలు బోనాలను నెత్తినెత్తి మేళతాళాలు, డప్పువాయిద్యాలు కరీంనగర్ వొగ్గుడోలు కళాకారుల బృందం ఆట పాటలు, విన్యాసాలు, భజనకీర్తనలతో గ్రామం నుంచి దూలగుట్టపైగల మల్లన్న స్వామి ఆలయం వరకు ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం యాదవుల ప్రత్యేక పూజారి అగ్గుమల్లన్న ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో భాగంగా ఆలయంవద్ద సోమవారం స్వామివారి జాతర, అన్నదానం నిర్వహించారు. భక్తులుహజరై స్వామివారిని దర్శించుకున్నారు. కాగా మంగళవారం ఎల్లమ్మపట్నాలు, బుధవారం అగ్నిగుండం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో అధ్యక్షుడు పెద్ద ముత్తెన్న, కార్యదర్శి రాజు, సభ్యులు మల్కన్న, దేవన్న, సాగర్, సంపత్, చిన్నయ్య, శేఖర్, బైకాని మహేష్, సామెర సుమన్ గ్రామ యాదవ కుల సంఘం సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాల్కొండలో మహా పడిపూజ

ముప్కాల్, జనవరి1: బాల్కొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో సోమవారం అయ్యప్పస్వామి మందిరంలో సామూహిక పడి పూజ నిర్వహించారు. మణికంఠ సన్నిధానం అయ్యప్ప క్షేత్ర ఆధ్వర్యంలో మహాపడిపూజను గనకోకిల రమణగురుస్వామి హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ మండలాల నుంచి అయ్యప్పస్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయ్యప్పస్వామి నామస్మరణతో స్వామివారికి పాలాభిషేకం, నెయ్యిభిషేకం, పంచమృతాలతో అభిషేకం నిర్వహించి 18మెట్ల పూజ నిర్వహించారు. దేవాలయ కమిటీ ఐక్యంగా ఉంటూ దేవాలయ అభివృద్ధికి కృషి చేయడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. అనంతరం భిక్షలో అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



బాల్కొండలో అయ్యప్ప పడి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గిరిరాజ్ కళాశాల అధ్యాపకుడికి పదోన్నతి

నిజామాబాద్ అర్బన్, జనవరి 1: నగరంలోని గిరిరాజ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తెలుగు విభాగంలో పనిచేస్తున్న ఎన్.అంబర్‌సింగ్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. రాష్ట్రస్థాయిలో పలు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కాలిజియేట్ కమిషనర్ ఈ పదోన్నతులను కల్పించారు. గిరిరాజ్ కళాశాలలో 2011 నుంచి పనిచేస్తున్న ఆయన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్‌గా కూడా బాధ్యతలను నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని కూడా ఆయన పొందారు. పదోన్నతి పొందిన ఆయనను పలువురు అధ్యాపకులు అభినందించారు.

ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగు తొలగించని అధికారులు



ముసుగుతో ఉన్న అర్గుల్ రాజారాం విగ్రహం

ఆర్మూర్‌టౌన్ , జనవరి1: పట్టణంలోనినడిబొడ్డున గల వాటర్‌ఫౌంటేన్ వద్ద అర్గుల్ రాజారాం విగ్రహానికి ముసుగును తొలగించని అధికారులు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు పలు పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులను వేశారు. ఎన్నికల కోడ్ ముగిసి సుమారు నెల రోజులు కావస్తున్న ఇప్పటి వరకు ముసుగును తొలగించకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ముసుగు తొలగించని అధికారులు నిద్రావస్థలో ఉన్నారని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా ముసుగును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రేవంత్‌రెడ్డి పాట కోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

- కాంగ్రెస్ నాయకుడి ఛాతిపై గుద్దిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు
- అక్కడికక్కడే కాంగ్రెస్ నాయకుడి మృతి
- మృతుడి కుటుంబీకులు, కాంగ్రెస్ నాయకుల ఆందోళన



కాంగ్రెస్ పార్టీ నాయకులను, కుటుంబ సభ్యులను సముదాయిస్తున్న పోలీసులు

నసురుల్లాబాద్, జనవరి1: రేవంత్‌రెడ్డి పాట కోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో కాంగ్రెస్ నాయకుడు మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో చోటుచేసుకుంది. నాచుపల్లి గ్రామంలో న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా రేవంత్‌రెడ్డి పాట పెట్టుకుని నృత్యాలు చేస్తుండగా నలుగురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు వెళ్లి రేవంత్‌రెడ్డి పాటను ఆపాలని చెప్పారు. అంతలో కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని పాటను ఆపొద్దనడంతో ఇరు పార్టీ నాయకులు మధ్య మాటామాట పెరిగి ఘర్షణ పెద్దదైంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు సాదుల రాములు గొడవను ఆపడానికి వెళ్లి ఇరు పార్టీ నాయకులను నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ కార్యకరలు బీర్‌సీసాతో సాదుల రాములు ఛాతిపై గుద్దారు. దీంతో సాదుల రాములు (45) అక్కడికక్కడే మృతి చెందినట్లు సాదుల రాములు తమ్ముడు విఠల్ తెలిపాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు గ్రామానికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఘర్షణ విషయం తెలుసుకున్న డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బసవరాజ్ పటేల్ ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడి మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళనను విరమించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి రాములు మృతదేహాన్ని పరిశీలించి శవ పంచనామా చేసి మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామానికి చెందిన కీసర రవి, కొంగల అనిల్, కొంగల వినోద్, గోపాల్‌లు కక్షపూరితంగానే తన భర్తను చంపారని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ప్రజల సహకారంతో శాంతిభద్రతలను కాపాడాలి



అదనపు డీసీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు సిబ్బంది

ఖిల్లా, జనవరి 1: నూతన సంవత్సరంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మెరుగైన పోలీసు సేవలు అందించి శాంతిభద్రతలను కాపాడాలని అందుకు ప్రజల సహకారం తీసుకోవాలని పోలీస్ శాఖ సిబ్బందికి అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) జయరాం సూచించారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయన ఛాంబర్‌లో పలువురు పోలీసు సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి సత్సంబంధాలు నెలకొల్పాలని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సీటీసీ ఏసీపీ టీఎస్ శ్రావణ్ కుమార్, నిజామాబాద్, బోధన్, ట్రాఫిక్, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు ఎం.కిరణ్‌కుమార్, కేఎం కిరణ్‌కుమార్, నారాయణ, కె.రాజశేఖర్‌రాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, టౌన్ సీఐ నరహరి, ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం సిబ్బంది, సీసీఆర్‌బీ సిబ్బంది, సెంట్రల్ కాంప్లెంటు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అదనపు డీసీపిని కలిసిన ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు

ఖిల్లా: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఆఫీసర్స్ క్లబ్ యూనియన్ సభ్యులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, ఎగ్జిబిషన్ అసోసియేషన్ సభ్యులు, బంధన్ బ్యాంక్ సభ్యులు అదనపు డీసీపీ జయరాంను ఆయన ఛాంబర్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరందరికీ సీపీ తరపున డీసీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులకు ప్రజల సహకారం ఎల్లవేళలా ఉండాలని, రానున్న రోజుల్లో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తిని కాపాడిన రూరల్ పోలీసులు

- అభినందించిన డీసీపీ

నిజామాబాద్ రూరల్, జనవరి 1: కొత్త సంవత్సర వేడుకల్లో వేగంగా బైక్ నడిపి కిందపడి తీవ్రగాయాలైన వ్యక్తిని రూరల్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ ప్రాణాలు నిలబెట్టిన ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. నీరడి రజనీకాంత్ అనే వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ముబారక్‌నగర్ నుంచి కంఠేశ్వర్‌కు బైక్‌పై వస్తూ కంఠేశ్వర్ బైపాస్ సమీపంలో అదుపుతప్పి బైక్ నుంచి కిందపడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్రగయాలయ్యాయి. అదే సమయంలో రూరల్ పోలీసు స్టేషన్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుంకరి గంగాధర్ గాయాలపాలైన వ్యక్తిని గమనించి అతని పరిస్థితిని గమనించాడు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. గాయపడిన వ్యక్తికి ఊపిరి ఆడకపోవడంతో వెంటనే కానిస్టేబుల్ సీపీఆర్ (నోటితో గాలి ఊదడం) చేసి ప్రాణాలు కాపాడాడు. అంబులెన్స్ రాకపోవడంతో రూరల్ పోలీసు స్టేషన్ వాహనంలోనే వెంటనే ఆసుపత్రికి తరలించారు.

దీంతో సదరు వ్యక్తికి ప్రాణపాయం తప్పింది. విషయం తెలుసుకున్న డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్ కుమర్, సీఐ వెంకటనారాయణలు కానిస్టేబుల్ గంగాధర్‌ను అభినందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాలు కోల్పోతున్న వ్యక్తిని కాపాడి సీపీఆర్‌చేసి ప్రాణాలు కాపాడినందుకు అభినందించారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్, తోటి సిబ్బంది సైతం గంగాధర్‌ను అభినందించారు.

కొత్త సంవత్సర వేడుకల్లో యువకుల ఘర్షణ

- పోలీసులకు ఫిర్యాదు చేయని బాధితులు
- ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్టింగ్‌లు

ఖిల్లా,జనవరి 1: నగరంలోని కోటగల్లీలో యువకులు హల్‌చల్ చేశారు.రోడ్డుపై ఉన్న యువకులపై మరో యువకుల బృందం దాడులు చేశారు. కొత్త సంవత్సర వేడుకల్లో మద్యం తాగిన యువకులు నలుగురు యువకులపై దాడులు చేసి గాయపర్చిన ఘటన కోటగల్లీలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పాత కక్షల నేపథ్యంలో నలుగురు యువకులపై ప్రత్యర్థి వర్గానికి చెందిన కిరణ్ అనే యువకుడి అనుచరులు దాడులు చేసినట్లు సమాచారం. విచక్షణా రహితంగా దాడి చేయడంతో నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదిత్య, కన్నయ పేర్లతో దాడులు చేస్తున్న వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినట్లు తెలిసింది. నలుగురు యువకులపై సుమారు 50మంది వరకు యువకులు దాడి చేసినట్లు సమాచారం. ఈ విషయమై నగరంలోని నాలుగో టౌన్ పోలీసు స్టేషన్‌లో బాధితులు కార్తికుమార్, యుగందర్, రక్షిత్ ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధితులు ఫిర్యాదు చేస్తే కేసున మోదు చేస్తామని ఎస్ఐ సంజీవ్ తెలిపారు.

మోర్తాడ్‌లో యువకుడి హత్య

- వివాహేతర సంబంధమే కారణమంటున్న పలువురు
- నిందితుడు ఇంటి ముందు ఉద్రిక్తత



రాకేష్ (ఫైల్)

మోర్తాడ్, జనవరి1: మోర్తాడ్ మండల కేంద్రంలోని దళితవాడలో చెప్పాల రాకేష్(24) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. స్థానిక సీఐ వెంకటేశ్వర్ కథనం ప్రకారం.. మోర్తాడ్‌కు చెందిన రాకేష్, తెడ్డు సూర్య అనే ఇద్దరు యువకులు స్నేహితులు. తెడ్డు సూర్య విదేశాలకు వెళ్లడంతో అతడి భార్యతో రాకేష్ వివాహేతర సంబంధం కొనసాగించాడు. అయితే ఇటీవల స్వదేశానికి తిరిగి వచ్చిన సూర్య భార్యను మందలించాడు. సోమవారం ఉదయం 11గంటలకు సూర్య దళితవాడలో ఉన్న రాకేష్‌ను కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు సూర్య, అతడి కుటుంబసభ్యులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. రాకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం దళితవాడలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అంతలోనే సూర్య ఇంటికి నిప్పు పెట్టాలని ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. మృతుని కుటుంబసభ్యులు, మహిళలు పోలీసులు చెప్పిన వినకుండా ఇంటి ముందు బైటాయించారు. సీఐ, ఎస్సైలు కుల పెద్దలతో మాట్లాడుతూ నిందితునికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, ఎలాంటి ఆందోళన చేయవద్దని, తమకు సహకరించాలని కోరారు. అయినా మహిళలు వినకపోవడంతో రాత్రి వరకు నిందితుడి ఇంటి వద్దనే ఉండి పరిస్థితి చేయి దాటకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. కుల పెద్దలు కూడా బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడినా వినకపోవడంతో ఆందోళన విరమించక టపోవడంతో కుల పెద్దలు కూడా ప్రయత్నాలు మానుకున్నారు. చివరకు పోలీసులు నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని, వారిని ఎక్కడ ఉన్న అరెస్టు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న బాధితులు

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

- జీవో జారీ చేసిన రాష్ట్ర ముఖ్యకార్యదర్శి జితేందర్

ఖిల్లా, జనవరి 1:రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది పనితీరుతో ప్రతీ సంవత్సరం జనవరిలో ప్రకటించే పతకాలను సోమవారం రాత్రి రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అందించే శౌర్య, మహోన్నతసేవా పతకం, కఠినసేవా పతకం, ఉత్తమ సేవా పతకం, సేవా పతకాలను ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో పతకాలను సాధించిన వారు ఉన్నారు. డిప్యూటీ పోలీసు కమిషనర్ ఆఫ్ పోలీసు లా అండ్ ఆర్డర్ జయరాంకు ఉత్తమ సేవా పతకం ప్రకటించారు. సీటీసీ ఏసీపీ టీ.సుబ్రహ్మణ్యం శ్రవణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు మందాది వెంకటసురేందర్‌రెడ్డి,సీటీసీ ఎస్ఐ ఆత్రం దేవారావ్, సీఎస్‌బీ ఎస్ఐ కర్తపువిఠల్, రూరల్ ఎస్ఐ జాదవ్‌రామారావ్, పీసీటీ ఎస్ఐ దులం మహేందర్, బోధన్ ఎస్ఐ చెన్నారామారావు, వీర్ ఎస్ఐ గొల్లఎల్లయ్య, ఏఆర్‌ఎస్ఐ కార్‌హెడ్‌క్వార్టర్స్ హన్మంతేనాగేశ్వర్, ఏఎస్ఐ ఎరగట్ల సయ్యద్ ఇస్మాయిల్, తిరునగరి వెంకటరమణ, అల్లంకి జనార్దన్‌రావ్, పాలకొనలు రమణరెడ్డి, కే.సతీష్, గంగోని లక్ష్మణ్, కోట అరుణకుమారి(మహిళ కానిస్టేబుల్),అనుపాలరాములు, కామార్తి ఉషాశేఖర్,7వ బెటాలియన్ డిచ్‌పల్లి వెంకటరెడ్డి, సీహెచ్ లక్ష్మయ్య,వాల్గోట్ శ్రీనివాస్(ఇంటలిజెన్స్)సేవా పతకాలు పొందినవారిలో ఉన్నారు.

కామారెడ్డి(ఆంధ్రజ్యోతి) జనవరి 1: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీన విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పోలీసులకు సేవా పథకాలను అందజేస్తోంది. అందులో భాగంగా సోమవారం ప్రకటించిన పథకాలలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఐదుగురు పోలీసులు ఎంపికయ్యారు. అనుమాసు శ్రీనివాసులు(ఎల్లారెడ్డిడీఎస్పీ),నల్లాభూపాల్(ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్, కామారెడ్డి),అల్వాలసురేందర్ (హెడ్‌కానిస్టేబుల్(సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కామారెడ్డి),వరికుప్పల రాములు (ఏఎస్సై పెద్దకొడంగల్ పోలీసు స్టేషన్), తమ్మెగంగాసాగర్(ఏఎస్సైసదాశివనగర్ పోలీసు స్టేషన్).జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వ సేవా పథకాలకు ఎంపికైనా ఐదు గురికి జిల్లా ఎస్పీ సింధుశర్మ, జిల్లాపోలీసు అధికారులు అభినంద నలు తెలియజేశారు.

లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

ముప్కాల్, జనవరి1: మండల కేంద్రంలో శాలివాహన దేవాదాయ కమి టీ సభ్యులు ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మొదటి రోజు సోమవారం స్వామివారి మూల విరాట్‌లను విగ్రహాలను గ్రామ పొలిమేర నుంచి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. మహిళల మంగళహారతులతో శోభాయమానంగా ఎదుర్కోలు నిర్వహించారు. వేద పండితుల మధ్య గోపూజ, అఖండ దీపరాధన, గణపతి గౌరీపూజ, స్వస్తిక్ పుష్పహా, స్వస్తి పుణ్య ఆవాహన దీక్షధారణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ యోగిని, వాస్తు, క్షేత్రపాలక, హవనం, సాయంత్రం మంత్రపుష్ప, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'ఎడపల్లి రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలి'

ఎడపల్లి, జనవరి 1: నైజాం కాలం నుంచి ఎందరో ప్రయాణికులు ఎడపల్లి రైల్వే స్టేషన్ నుంచి బోధన్, నిజామాబాద్‌తో పాటు ఇతర ప్రదేశాలకు రాకపోకలు సాగించే వారు. అయితే ప్రయాణికుల రద్దీ తగ్గిందన్న నేపంతో గత సంవత్సరం జనవరి 1న ఎడపల్లి రైల్వే స్టేషన్‌ను రైల్వే అధికారులు మూసి వేశారు. అప్పటి నుంచి ఎన్నో ధర్నాలు చేసినా నేటి వరకు రైల్వే స్టేషన్‌ను పునరుద్దరించక పోవడంతో వెంటనే రైల్వే స్టేషన్‌ను పునరుద్దరించాలంటూ అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రామ పంచాయతీ ఎదురుగా రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం నాయకులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ వెంటనే రైల్వే స్టేషన్‌ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు కూలీ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



రిలే నిరాహదీక్ష చేస్తున్న సీపీఐ (ఎంఎల్) నాయకులు

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

- నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు

బోధన్ రూరల్, జనవరి 1 : నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. సోమవారం బోధన్‌లోని ఏకచక్రేశ్వర ఆలయంతో పాటు అన్ని దేవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం అంతా అనుకున్న కార్యాలు నెరవేరాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో అన్నశాంతి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు గణేష్ మహరాజ్, సంతోష్ మంత్రోచ్చరణల ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, ఆలయ డైరెక్టర్లు, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మోపాల్: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండలంలోని ఇందూరు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, మాధవనగర్ సాయిబాబా ఆలయం, లక్ష్మీగణపతి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూతన సంవత్సరం పురస్కరించుకొని ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఇందూరు తిరుమల ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి నుంచే భక్తులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులకు తిరుపతి నుంచి తీసుకువచ్చిన లడ్డూను ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు. బోర్గాం(పి) గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి కూడా ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మాధవనగర్ సాయిబాబా ఆలయం, బోర్గాం(పి) గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయాలకు భక్తులు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

నవీపేట: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆలయంలో గురుస్వామి సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకం, హోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి నూతన సంవత్సర ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2023సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ అర్ధరాత్రి 12గంటలకు కేక్‌లను కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలో ఎస్‌ఐ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. సోమవారం నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.


శివాలయంలో అన్న శాంతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం


లింబాద్రి గుట్టపై బారులు తీరిన భక్తులు

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12గంటలకు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెంజల్/మోస్రా/ వర్ని: రెంజల్, మోస్రా, చందూర్, వర్ని, రుద్రూర్ మండలాల్లో సోమవారం మండల ప్రజలు నూతన సంవత్సర ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధర్పల్లి: నూతన సంవత్సరం వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే చిన్న పెద్ద తేడా లేకుండా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. దేవాలయాల్లో కొత్త సంవత్సరం సందర్భంగా ప్రజలు పోటెత్తారు. దైవదర్శనం చేసుకొని కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టారు. మండల ప్రజలకు ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్‌రాజ్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో పీఎస్ఎల్‌వీ-సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో బృందానికి వారు అభినందనలు తెలిపారు.

పెర్కిట్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివాలయంలో సిద్దేశ్వరునికి అభి షేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సుమన్, తి రుమల దంపతులు రామాలయంలో సత్యనారాయణ పూజ నిర్వహించారు. నందీశ్వర మహరాజును ఆలయ కమిటీ సభ్యుడు సుమన్ సన్మానించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవలో నిర్వహించారు. నూతన సంవత్సరం మొదటి రోజు సందర్భంగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు భారత్ గ్యాస్ సుమన్, తిరుమల దంపతులు అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీసీ గంగారెడ్డి, బోబిడె గంగాకిషన్, లక్ష్మణ్, మల్లయ్య, మీనచందు, అయ్యప్ప శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, యువకులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి 2023సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అన్ని గ్రామాల్లో డీజే పాటలతో కేరింతలు వేస్తూ, ప్రజలు, యువకులు టపాకాయలు కాల్చి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు.

భీమ్‌గల్ రూరల్: ఆదివారం అర్ధరాత్రి డిసెంబరు 31 ముగియగానే ఒక్కసారిగా యువత 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ టపాసులు కాల్చారు. కేక్ లు కట్ చేశారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచే మండలంలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం సుఖశాంతులతో గడవాలని భక్తులు కోరుకున్నారు. లింబాద్రి గుట్టకు భక్తులు పోటెత్తారు.

డిచ్‌పల్లి: నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం డిచ్‌పల్లి స్పటిక లింగేశ్వర ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. 7వ బెటాలియన్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పోలీసు బెటాలియన్ సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు. ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పిప్రి చర్చిలో నూతన సంవత్సర వేడుకలు

ఆర్మూర్‌రూరల్, జనవరి1: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలోని ఎల్ షెద్దాయి చర్చిలో నూతన సంవత్సర సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. ఫాస్టర్ శేఖర్ అడ్విన్ చిన్న పిల్లలతో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతీఒక్కరు ఆనందం, సంతోషంగా గడపాలని, ఏసుక్రీస్తు అందరికి మంచి ఆలోచనలు, మంచి మార్గాలు చూపాలని అన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆటపాటల నడుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్క్, చందు, చిన్ని, ప్రవీణ్ స్టీవేన్‌రాజ్, మనోజ్, సుకుమార్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న ఫాస్టర్

మచ్చర్లలో వికాసిత్ భారత్ కార్యక్రమం

ఆర్మూర్‌రూరల్, జనవరి1: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో సోమవారం వికాసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంజి నర్సయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజగంగారాం, పశువైద్యాధికారి లక్కం ప్రభాకర్, ఏఈ నితిష్, ఏపీవో ఉమ్మెడ సురేష్, బీజేపీ నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నరేంద్ర నాథ్ మహరాజ్‌ను కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు


మహరాజ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

పెద్దకొడప్‌గల్,జనవరి1:మండలంలోని దోసుపల్లి గ్రామంలో సోమవారం నరేంద్రనాథ్ మహరాజ్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నిర్మల్ జిల్లా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటే ల్ కలిసి స్వామి వారిఆశీర్వదాలు తీసుకున్నారు. రెండు రోజుల నుంచి దోసుపల్లి గ్రామంలో స్వామి వారి ప్రవచనాలు జరుగుతుండగా, జుక్కల్ మండలంతో పాటు, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ స్వామి వారి ఆధ్యాత్మిక సేవలు ఇలాగే కొనసాగాలని తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

దోమకొండ, డిసెంబరు 1:నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆవిష్కరించినట్లు మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి తెలిపారు. మాజీమంత్రి నివాసంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తతో కలసి క్యాలెండర్‌ను ఆవిష్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్, మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, సంగమేశ్వర్ గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కామారెడ్డి నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా విజయం కాంగ్రెస్ కార్యకర్తలకు అంకితం

పెద్ద కొడప్‌గల్, జనవరి 1: జుక్కల్ ఎమ్మెల్యేగా తన విజయాన్ని జుక్కల్ కాంగ్రెస్ కార్యకర్తలకు అంకితం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. సోమవారం జుక్కల్ ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయాన్ని పునఃప్రారంభించారు. అనంతరం జుక్కల్ నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను గత సంవత్సరం వరకు జుక్కల్ ప్రాంతానికి కొత్త వ్యక్తినని, అటువంటి తనను ఈప్రాంత ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ఈ విజయం జుక్కల్ ప్రజలకు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. తాను ఏం చేసినా జుక్కల్ ప్రజల రుణం తీర్చుకోలేనన్నారు.గత 15 ఏళ్లుగా నిరంకుశ పాలన ఉండేదని, దానిచెర నుంచి జుక్కల్ ప్రజలు ఇటీవలే బయట పడ్డారని తెలిపారు. ఇక తనపై జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే, మరో ఎమ్మెల్యేతో కలిసి తన కులం తప్పుడు పత్రాలతో ఉందని నిరూపించడానికి కుట్ర చేస్తున్నారన్నారు. ఈవిషయంలో షిండే ఎక్కడికి వెళ్లనవసరం లేదని, తన దగ్గరకు వస్తే ఏ సర్టిఫికెట్టు కావాలో ఇస్తానన్నారు. ఎన్నికల్లో ఓడిన షిండే హుందాగా ప్రవర్తించకుండా చెప్పుడు మాటలు విని కుట్రలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. జుక్కల్ ప్రజలకు ఏపని పడినా తాను అందుబాటులో ఉండి పనులు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వినోద్, రమేష్ దేశాయ్, మల్లికార్జునప్ప, విఠల్‌రావు, నాగ్‌నాథ్, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

వైభవంగా సంతమల్లన్న జాతర

భీమ్‌గల్‌రూరల్, జనవరి1: వేల్పూర్ మండలం అంక్సాపూర్ సంత మల్లన్న జాతర రథోత్సవం సోమవారం అంగరంగా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా బంతిపువ్వులతో ఒకరు భయకరమైన వేషధారణ (పోతరాజు)తో వచ్చి రథం (షిడే) ముందు మంత్రలు ఉచ్చరిస్తూ మేక గొర్రె పిల్లలను నోటితో గావుపట్టారు. రంగు రంగు పూలతో అలందంగా అలంకరించిన రథాన్ని దేవాలయం చుట్టూ తాళ్లతో వేలాది మంది భక్తులు ఐదు సార్లు తిప్పడం ఈ జాతరలో ప్రత్యేకంగా సంతరించుకుంది. సంతమల్లన్న దేవాలయ కమిటీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ జాతరలో వేలాది మంది వేల్పూర్ మండలాల నుంచి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఇతర జిల్లాలైన కరీంనగర్, ఆదిలాబాద్ కూడా అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సంతమల్లన్న స్వామికి పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వచ్చిన వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అంక్సాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేవలందించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, సంతమల్లన్న భక్తులు పాల్గొన్నారు.


రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్‌ఐ

దోమకొండ,జనవరి 1:నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మురళి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఎస్సై మురళి ఆధ్వర్యంలో పోలీసులు మండలంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహించారు.దోమకొండలో అంగడిబజార్, బీబీపేట్‌రోడ్డు, ముత్యంపేట రోడ్డు, మెయిన్ రోడ్డు, పలుగడ్డ, ఊరడమ్మ, తదితర ప్రాంతల్లో గస్తీ తిరిగారు.మద్యంతాగి వేగంగా వాహనాలు నడిపితే, తోటివారికి ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తే అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోమం


క్యాంపు కార్యాలయంలో శాంతి పూజలు చేయిస్తున్న పురోహితులు

పెద్దకొడప్‌గల్, జనవరి 1: జుక్కల్ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం శాంతి పూజలు నిర్వహించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న షిండే సమయంలో ఈ క్యాంపు కార్యాలయం నిర్మించగా అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న షిండే ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు.అయితేషిండే ఈకార్యాలయంలో సరిగ్గా ఉండకపోవడంతో కార్యాలయం పాతపడి పోయింది. దీంతో కొత్తగా ఎమ్మెల్యేగా గెలిచిన తోట ఈ కార్యాలయ భవనాన్ని బాగు చేయించారు. దీంతో సోమవారం వేద పండితులు శాంతి హోమం నిర్వహించారు. హోమం అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్ రావ్ కార్యాలయాన్ని పునఃప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిజాంసాగర్, జనవరి 1: 161వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఓవ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంసాగర్ మండలం బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన గరబోయిన లాలయ్య (61) అనే వ్యక్తి గ్రామం నుంచి పిట్లం వెళుతుండగా, వెనుక వైపు నుంచి వచ్చిన ఓ కారు ఢీ కొనడంతో లాలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు, గ్రామస్థులు చేరుకుని మృతిచెందిన లాలయ్య మృతదేహాన్ని బాన్సువాడ ఏరియాస్పత్రికి తరలించారు. లాలయ్య ఇంటి నుంచి ఎక్సెల్‌పై బయలు దేరి పిట్లం మండల కేంద్రానికి వెళ్లి ఇంటి సామగ్రి కోసం వెళుతుండగా, ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. భార్య పెంటవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపు తున్నారు. లాలయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నూతన సంవత్సరం మొదటి రోజు ఈప్రమాదం చోటు చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.